తెలుగులో 'కేశవానంద భారతి' తీర్పు

మరో 9 భాషల్లోనూ అందుబాటులోకి

సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ వెల్లడి

న్యూఢిల్లీ: రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని మార్చే అధికారం పార్లమెంటుకు లేదని 1973లో సర్వోన్నత న్యాయస్థానం వెలువరించిన చరిత్రాత్మక తీర్పు ప్రస్తుతం తెలుగుసహా 10 భారతీయ భాషల్లో అందుబాటులో ఉన్నది. 'కేశవానంద భారతి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ'గా ప్రసిద్ధి చెందిన ఈ కేసులో రాజ్యాంగ సవరణ విషయంలో పార్లమెంటుకు ఉన్న అధికారాలపై సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఈ తీర్పు వెలువడి 50 ఏండ్లు పూర్తయింది. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ మాట్లాడుతూ.. ఈ తీర్పు కోసం సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో ఓ పేజీని ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రస్తుతం ఈ తీర్పు హిందీ, తెలుగు, తమిళం, ఒడియా, మలయాళం, గుజరాతీ, కన్నడ, బెంగాలీ, అస్సామీస్, మరాఠీ భాషలలో అందుబాటులో ఉందన్నారు. హిందీని ఉపయోగించే జిల్లా కోర్టులు, న్యాయవాదులు ఇకపై సుప్రీంకోర్టు తీర్పులను హిందీలోనే ప్రస్తావించవచ్చునని తెలిపారు. షెడ్యూల్డు భారతీయ భాషలన్నింటిలోకి తీర్పులను అనువదిస్తున్నట్లు చెప్పారు.

ఏమిటి ఈ తీర్పు?

రాజ్యాంగాన్ని సవరించేందుకు పార్లమెంటుకు గల అధికారాన్ని పరిమితం చేస్తూ రాజ్యాంగ ధర్మాసనం 1973లో కేశవానంద భారతి కేసులో తీర్పు చెప్పింది. రాజ్యాంగ సవరణలు చేసే అధికారం పార్లమెంట్‌కు ఉంది కానీ, రాజ్యాంగ మౌలిక నిర్మాణాన్ని మార్చే అధికారం లేదని ప్రకటించింది. ప్రజాస్వామ్యం, న్యాయ వ్యవస్థ స్వతంత్రత, అధికారాల విభజన, లౌకికవాదం వంటివి మౌలిక స్వరూపంలో భాగమని, వాటిని సవరించేందుకు వీలులేదని స్పష్టంచేసింది.

మెఫ్తాల్ పెయిన్ కిల్లర్‌తో జాగ్రత్త

- ప్రజలను హెచ్చరించిన కేంద్రప్రభుత్వం
- దుష్ప్రభావాలు తలెత్తుతున్నట్టు వెల్లడి

న్యూఢిల్లీ: ఒళ్లు నొప్పులు, జ్వరం, పంటి నొప్పులకు చికిత్సలో మెఫ్తాల్ (ఎంఈఎఫ్‌టీఏఎల్)ను వైద్యులు సూచిస్తూ ఉంటారు. రుతుస్రావానికి సంబంధించిన నొప్పులు, రుమటాయిడ్ ఆర్తరైటిస్‌ను నయం చేయడానికి దీనిని వాడటం సాధారణంగా మారిపోయింది. అయితే దీని వాడకం వల్ల ప్రతికూల ఫలితాలు వస్తున్నట్లు ప్రాథమికంగా వెల్లడైందని కేంద్ర ఆరోగ్య శాఖ పరిధిలోని 'ది ఇండియన్ ఫార్మకోపోయియా కమిషన్' (ఐపీసీ) హెచ్చరించింది. దీనిని వాడినపుడు రోగుల్లో కనిపించే ప్రతికూల ప్రభావాన్ని పర్యవేక్షించాలని వైద్య నిపుణులకు, రోగులకు చెప్పింది. ఫార్మా కోవిజిలెన్స్ ప్రోగ్రామ్ ఆఫ్ ఇండియా (పీవీపీఐ) డాటాబేస్‌ను పరిశీలించినపుడు యూసినోఫిలియా, సిస్టమిక్ సింప్టమ్స్ సిండ్రోమ్ (తెల్ల రక్త కణాలు ఎక్కువగా చేరడం) కనిపించినట్లు తెలిపింది. మెఫ్తాల్‌ను వాడినవారిలో ఇలాంటి దుష్ప్రభావాలు కనిపించినట్లయితే, పీవీపీఐ జాతీయ సమన్వయ కేంద్రానికి తెలియజేయాలని తెలిపింది. www.ipc.gov.in వెబ్‌సైట్ ద్వారా కానీ, హెల్ప్‌లైన్ నెం.1800 180 3024 ద్వారా కానీ సంప్రదించాలని కోరింది. దేశీయ ఔషధాలకు ప్రమాణాలను ఐపీసీ నిర్ణయిస్తుంది.

సహజీవనం ప్రమాదకర రోగం!

- వ్యతిరేకంగా చట్టం తేవాలి
- ప్రేమ వివాహాల్లోనే విడాకుల రేటు ఎక్కువ
- లోక్‌సభలో బీజేపీ ఎంపీ

న్యూఢిల్లీ: హర్యానా బీజేపీ ఎంపీ ధరమ్‌బీర్ సింగ్ సహజీవనాన్ని ప్రమాదకర రోగంగా అభివర్ణించారు. దాన్ని సమాజం నుంచి నిర్మూలించేందుకు ప్రభుత్వం చట్టం చేయాలని కోరారు. గురువారం లోక్‌సభ జీరో అవర్‌లో ఆయన మాట్లాడుతూ ప్రేమ పెండ్లిళ్లలో విడాకుల రేటు పెరుగుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి వివాహాలకు వధూవరులిద్దరి తల్లిదండ్రుల అనుమతి తప్పనిసరి చేయాలని కోరారు. 'ఈ విషయం తీవ్రమైనదని నేను పార్లమెంట్, ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలనుకుంటున్నాను. ఏడు తరాల పాటు కొనసాగే పెండ్లిని పవిత్రమైన బంధంగా పరిగణిస్తారు. అమెరికాలో 40 శాతంగా ఉన్న విడాకుల రేటులో పోలిస్తే ఇండియాలో దాని రేటు 1.1 శాతం. పెద్దలు కుదిర్చిన పెండ్లిళ్లలో విడాకుల రేటు చాలా తక్కువ. కానీ ఇటీవల విడాకుల రేటులో చాలా పెరుగుదల కనిపిస్తున్నది. దానికి ప్రధాన కారణం ప్రేమ వివాహాలు' అని ధరమ్‌బీర్ సింగ్ అన్నారు. దేశంలోని చాలా ప్రాంతాల్లో ఒకే గోత్రానికి చెందిన వారి మధ్య వివాహాలు జరగవని.. కానీ ప్రేమ వివాహాల వల్ల పల్లెల్లో చాలా సంఘర్షణలు జరుగుతున్నాయన్నారు. సహ జీవనం మన మన సంస్కృతిని నాశనం చేస్తున్నదన్నారు.

12.5% పెరిగిన గుండెపోటు మరణాలు

ఎన్‌సీఆర్‌బీ నివేదిక

న్యూఢిల్లీ, డిసెంబర్ 7: 2021తో పోలిస్తే 2022లో గుండెపోటు మరణాలు 12.5 శాతం పెరిగాయని ఎన్‌సీఆర్‌బీ నివేదిక వెల్లడించింది. 2022లో 32,547 మంది గుండెపోటు కారణంగా మరణించారని తెలిపింది. కొవిడ్ వ్యాధి వల్ల గుండె పనితీరు బలహీనంగా ఉండటం ఈ మరణాలకు ఒక కారణమని చెప్పింది. 2022లో 56,450 హఠాత్తు మరణాలు సంభవించాయని, ఆ ఏడాదికి ముందు మూడేండ్లతో పోలిస్తే హఠాత్తు మరణాల సంఖ్య పెరగడం ఆందోళన కలిగిస్తున్నదని తెలిపింది. హింస వల్ల కాకుండా ఇతర ఏ కారణాల వల్లనైనా(ఉదాహరణకు గుండెపోటు, మెదడులో రక్తస్రావం) నిమిషాల వ్యవధిలో మరణం సంభవిస్తే ఆ మరణాన్ని హఠాత్తు మరణంగా పరిగణిస్తామని తెలిపింది.

మధుమేహాన్ని తగ్గించే కీళ్లవాతం మందు!

న్యూఢిల్లీ, డిసెంబర్ 7: కీళ్లవాతానికి వాడే బారిసిటినిబ్ అనే మందుతో టైప్-1 మధుమేహాన్ని నియంత్రించవచ్చని శాస్త్రవేత్తలు వెల్లడించారు. శరీరంలో ఇన్సులిన్ ఉత్పత్తిని ఈ మందు సంరక్షిస్తుందని మెల్‌బోర్న్‌కు చెందిన సెయింట్ విన్సెంట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్ శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ మందు వాడటం ప్రారంభించిన 100 రోజుల్లో ఆశాజనక ఫలితాలు వచ్చాయని వెల్లడించారు.

రాజస్థాన్‌లో రిసార్టు రాజకీయాలు

- ముఖ్యమంత్రి పదవిపై కొనసాగుతున్న సస్పెన్స్
- బీజేపీ ఎమ్మెల్యేలతో వసుంధర రాజే మంతనాలు!
- మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రుల ఎంపిక కోసం పరిశీలకులను నియమించనున్న బీజేపీ అధిష్ఠానం

జైపూర్, డిసెంబర్ 7: రాజస్థాన్‌లో ముఖ్యమంత్రి పదవిపై సస్పెన్స్ కొనసాగుతున్నది. గెహ్లాట్ సర్కారును గద్దె దించి అధికారంలోకి వచ్చిన బీజేపీ.. కాబోయే ముఖ్యమంత్రి ఎవరన్నది ఇంకా ప్రకటించలేదు. దీంతో రాష్ట్రంలో రిసార్టు రాజకీయాలు ఊపందుకున్నాయి. మాజీ ముఖ్యమంత్రి వసుంధర రాజే ఇప్పటికే పలువురు పార్టీ ఎమ్మెల్యేలతో మంతనాలు సాగిస్తున్నట్టు ఆ పార్టీ వర్గాలే చెబుతున్నాయి. దాదాపు 60 మంది ఎమ్మెల్యేలతో ఆమె ఇప్పటికే చర్చలు జరిపినట్టు పేర్కొన్నాయి. తాజాగా ఆరుగురు బీజేపీ ఎమ్మెల్యేలను జైపూర్ శివారులోని ఒక రిసార్టుకు రప్పించి రాజే కుమారుడు, పార్టీ ఎంపీ దుష్యంత్‌సింగ్ మంతనాలు సాగించడం చర్చనీయాంశమైంది. ఈ విషయాన్ని సాక్షాత్తు పార్టీ ఎమ్మెల్యే లలిత్ మీనా తండ్రి, మాజీ ఎమ్మెల్యే హేమరాజ్ మీనా పార్టీ అధిష్ఠానానికి తెలియజేశారు. తన కుమారుడిని మరో ఐదుగురు ఎమ్మెల్యేలను దుష్యంత్ సింగ్ అపనో రాజస్థాన్ రిసార్టుకు తీసుకుపోయారని, అక్కడి నుంచి అతడిని వదలలేదని, అక్కడ తానే కాక మరో ఐదుగురు ఎమ్మెల్యేలు ఉన్నట్టు తన కుమారుడే ఫోన్ చేసి చెప్పినట్టు ఆయన వెల్లడించారు. దీంతో అప్రమత్తమైన పార్టీ వర్గాలు వెంటనే రిసార్టుకు వెళ్లి లలిత్ మీనాను తమ పార్టీ కార్యాలయానికి తీసుకుపోయారు. అయితే మిగిలిన ఐదుగురు ఎమ్మెల్యేలను వసుంధర రాజే నిర్వహించిన మరో క్యాంప్‌నకు తరలించారని ఆయన చెప్పారు. కాగా, ఎమ్మెల్యేలందరూ తమ నియోజకవర్గాల్లో సురక్షితంగా ఉన్నారని, సీఎం ఎవరనేది అధిష్ఠానమే నిర్ణయిస్తుందని రాజస్థాన్ బీజేపీ అధ్యక్షుడు సీపీ జోషి తెలిపారు.

తెరపైకి అశ్వినీ వైష్ణవ్ పేరు

రాజస్థాన్ ముఖ్యమంత్రి పీఠంపై బీజేపీ అధిష్ఠానం ఇంకా సస్పెన్స్ కొనసాగిస్తుండటంతో సీఎం అభ్యర్థులపై జోరుగా చర్చ నడుస్తున్నది. తాజాగా ఈ పదవి కోసం కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ పేరు తెరపైకి వచ్చింది. ముఖ్యమంత్రి పదవికి ఆయన సరైన వ్యక్తి అని పార్టీలోని మెజారిటీ వర్గం అభిప్రాయపడుతున్నది. అశ్వినీ వైష్ణవ్ అటు ప్రధాని మోదీకి, ఇటు కేంద్ర మంత్రి అమిత్ షాకు సన్నిహితుడు కావడంతో ఆయన ఎంపికకు అడ్డంకులు ఉండకపోవచ్చునని అంటున్నారు.

షెకావత్‌కు అవకాశం ఉందా?

మరో కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ కూడా సీఎం పదవికి రేసులో ఉన్నారు. అయితే ఇప్పటికే రాజ్‌పుత్‌లు మిగిలిన రాష్ట్రాల్లో సీఎంలుగా ఉన్నందున ఈయనను ఇక్కడ ముఖ్యమంత్రిగా నిర్ణయిస్తారా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇక మోదీ, అమిత్ షాలకు అత్యంత ఆప్తుడిగా పేరొందిన దళిత నేత అర్జున్ రామ్ మేఘ్వాల్ పేరు కూడా ప్రముఖంగా వినిపిస్తున్నది. 18 శాతం మంది దళితులు ఉన్న రాజస్థాన్ సీఎం పీఠంపై అదే వర్గానికి చెందిన వ్యక్తిని కూర్చోబెట్టాలనుకుంటే మేఘ్వాల్‌కు అవకాశం దక్కొచ్చు.

మరో యోగికి అవకాశం లభిస్తుందా?

యూపీ సీఎం యోగి మాదిరిగా పేరొందిన బాబా బాలక్‌నాథ్ సీఎం రేసులో ఉన్నారు. రోహ్‌తక్‌లోని ఆయన మఠం హర్యానా, రాజస్థాన్ చుట్టుపక్కల ప్రాంతాలలో బాగా పేరొందింది. హిందూత్వ కార్డుకు ప్రాధాన్యం ఇవ్వాలనుకుంటే ఆ కోటాలో బాలక్‌నాథ్ సీఎం అయ్యే అవకాశం ఉంది. అలాగే గత కాంగ్రెస్ సీఎం గెహ్లాట్ ప్రభుత్వాన్ని ముప్పుతిప్పలు పెట్టిన కిరోడీ లాల్ మీనాతో పాటు రాజపుత్ర సంఘానికి చెందిన దియా కుమారి పేరు కూడా ప్రముఖంగా వినిపిస్తున్నది. వసుంధర రాజే అనంతరం ఒక మహిళకు అధికార పగ్గాలు ఇవ్వాలనుకుంటే ఈమెను పరిగణనలోకి తీసుకుంటారు.

ఎంపిక బాధ్యత పరిశీలకులకు

ఇటీవల బీజేపీ అధికారంలోకి వచ్చిన రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లో ముఖ్యమంత్రులను ఎంపిక చేసే బాధ్యతను బీజేపీ అధిష్ఠానం పరిశీలకులకు అప్పజెప్పనుంది. శుక్రవారం కేంద్ర పరిశీలకులను నియమించే అవకాశం ఉంది. పరిశీలకులు ఆయా రాష్ట్రాల్లో పర్యటించి ఎమ్మెల్యేలు, ముఖ్యమంత్రి అభ్యర్థులతో సమావేశమవుతారని పార్టీ ప్రతినిధి ఒకరు తెలిపారు. మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులపై పార్టీ ఇంతవరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, ఎంపికలో సామాజిక, ప్రాంతీయ, పాలన, సంస్థాగత అంశాలను పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు.

కట్నం వేధింపులు.. కేరళ వైద్యురాలి ఆత్మహత్య

తిరువనంతపురం: కేరళలోని తిరువనంతపురంలో వరకట్న వేధింపులతో ఓ వైద్యురాలు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వరకట్నంగా బీఎండబ్ల్యూ కారు, 15 ఎకరాల భూమి, 150 సవర్ల బంగారం ఇవ్వాలని ఆమె ప్రియుడి కుటుంబం డిమాండ్ చేయడంతో.. వాటిని ఇచ్చే స్తోమత లేక షహానా అనే వైద్యురాలు బలవన్మరణానికి పాల్పడింది. మృతురాలి బాయ్‌ఫ్రెండ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక మీడియా కథనాల ప్రకారం, ప్రభుత్వ వైద్య కళాశాలలో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేస్తున్న షహానా, డాక్టర్ ఈఏ రువాయిస్ ఇరువురు పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. అయితే రువాయిస్ కుటుంబం కోరినట్టుగా వరకట్నం ఇవ్వలేమని షహానా కుటుంబ సభ్యులు చెప్పడంతో వారు పెండ్లిని రద్దు చేశారు.

కేంద్రమంత్రుల రాజీనామాలకు ఆమోదం

వారి శాఖలు ఇతర మంత్రులకు అప్పగింత

న్యూఢిల్లీ, డిసెంబర్ 7: ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో శాసనసభ్యులుగా ఎన్నికైన కేంద్ర మంత్రులు నరేంద్ర సింగ్ తోమర్, ప్రహ్లాద్ సింగ్ పటేల్, రేణుకా సింగ్ సరుతల రాజీనామాలను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదించారు. ప్రధాని సలహా మేరకు వీరి రాజీనామాలను రాష్ట్రపతి ఆమోదించినట్టు రాష్ట్రపతి భవన్ ఒక ప్రకటనలో తెలిపింది. అలాగే ప్రధాని సూచన మేరకు గిరిజన శాఖ మంత్రి అర్జున్ ముండాకు వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖను.. ఐటీ శాఖ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్‌కు జల శక్తి శాఖను, మంత్రి శోభా కరంద్లాజేకు ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమ శాఖను, భారతీ ప్రవీణ్ పవార్‌కు గిరిజన వ్యవహారాల శాఖను అదనంగా అప్పగించినట్టు పేర్కొన్నది.

మార్చి 17న రష్యా అధ్యక్ష ఎన్నికలు

పుతిన్ ఐదోసారి ఎన్నికకు మార్గం సుగమం

మాస్కో:వ్లాదిమిర్ పుతిన్ రష్యా అధ్యక్ష పదవిని ఐదోసారి చేపట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే ఈ పదవికి పోటీ చేయడంపై ఆయన తన అంతరంగాన్ని ఇంత వరకు బయట పెట్టలేదు. దీనిపై విలేకర్లు అడిగిన ప్రశ్నకు క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ స్పందిస్తూ, 'ఓపిక పట్టండి' అని చెప్పారు. దేశాధ్యక్ష ఎన్నికలను వచ్చే సంవత్సరం మార్చి 17న నిర్వహించాలని నిర్ణయించారు. పుతిన్ ప్రత్యర్థుల్లో అత్యధికులు జైళ్లలో కానీ, విదేశాల్లో కానీ ఉన్నారు. కాబట్టి ఆయన మరోసారి ఆ పదవికి ఎన్నిక కావడం లాంఛనమేనని విశ్లేషకులు చెప్తున్నారు.

ఇథనాల్ తయారీలో చెరకు వినియోగం నిషేధం

- షుగర్ మిల్లులకు కేంద్రం ఆదేశాలు
- చక్కెర ధర నియంత్రణకు చర్యలు

న్యూఢిల్లీ, డిసెంబర్ 7: చెరకు నుంచి ఇథనాల్ తయారీపై కేంద్రం నిషేధం విధించింది. ఈ నెల నుంచి దేశంలోని చక్కెర మిల్లులు 2023-24 ఆర్థిక సంవత్సరంలో చెరకు రసాన్ని, చెరకు సిరప్‌ను ఇథనాల్ తయారీకి వినియోగించరాదని కేంద్ర ప్రభుత్వం గురువారం ఆదేశించింది. 2023-24 మార్కెటింగ్ సంవత్సరం (అక్టోబర్-సెప్టెంబర్)లో చక్కెర ఉత్పత్తి అంచనా తగ్గింది. దీంతో చెరకును ఇథనాల్ తయారీకి వాడటం వల్ల పంచదార ఉత్పత్తి తగ్గి తద్వారా దేశీయంగా ధరల పెరుగుదలకు దారితీసే అవకాశం ఉండటంతో అన్ని చక్కెర కర్మాగారాలు, డిస్టిలరీలకు ఈ ఆదేశాలు జారీ చేసినట్టు ప్రకటించింది. ఈ నిర్ణయం తక్షణం అమలులోకి వస్తుందని కేంద్రం స్పష్టంచేసింది.

నేడు లోక్‌సభ ముందుకు మొయిత్రా సస్పెన్షన్ నివేదిక!

న్యూఢిల్లీ, డిసెంబర్ 7: ప్రశ్నలు అడగడానికి డబ్బులు తీసుకున్నారన్న కేసులో టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రాపై నైతిక విలువల కమిటీ ఇచ్చిన నివేదిక శుక్రవారం పార్లమెంట్ ముందుకు వచ్చే అవకాశం ఉన్నదని పార్లమెంట్ వర్గాలు వెల్లడించాయి. ఈ నెల 4న ఈ అంశాన్ని అజెండాలో ఉంచినా చర్చించలేదు. మొయిత్రా సస్పెన్షన్ ప్రతిపాదనపై నిర్ణయం తీసుకొనే ముందు చర్చ జరగాలని పలువురు విపక్ష సభ్యులు కోరుతున్నారు. ఎథిక్స్ కమిటీలోని ఆరుగురు సభ్యులు నివేదికకు అనుకూలంగా ఓటేశారు. విపక్షాలకు చెందిన నలుగురు సభ్యులు అసమ్మతి నోట్‌ను సమర్పించారు. ఈ నివేదికను విపక్ష సభ్యులు 'ఫిక్స్‌డ్ మ్యాచ్'గా పేర్కొన్నారు. ఆరోపణలకు మద్దతుగా చిన్న ఆధారం కూడా లేదన్నారు.

హైకోర్టుల్లో 324 జడ్జి పోస్టులు ఖాళీ: కేంద్రం

న్యూఢిల్లీ: దేశంలోని వివిధ హైకోర్టుల్లో న్యాయమూర్తి పదవులు 324 ఖాళీగా ఉన్నట్లు కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ గురువారం రాజ్యసభకు లిఖితపూర్వకంగా తెలిపారు. అన్ని హైకోర్టుల్లో 1,114 మంది న్యాయమూర్తుల నియామకానికి అనుమతి ఉందని, ప్రస్తుతం 790 మంది పని చేస్తున్నారని తెలిపారు. హైకోర్టు కొలీజియంల నుంచి ఈ ఏడాది జనవరి వరకు 171 ప్రతిపాదనలు వచ్చాయని, ఈ ఏడాది కొత్తగా 121 ప్రతిపాదనలు వచ్చాయని, మొత్తం 292 ప్రతిపాదనల్లో 110 మంది న్యాయమూర్తుల నియామకాలు జరిగాయని చెప్పారు.

గుజరాత్‌లో నకిలీ టోల్ ప్లాజా

రూ.75 కోట్ల వసూలు

మోర్బి, డిసెంబర్ 7: జాతీయ రహదారిపై నకిలీ టోల్ ప్లాజా నడుపుతున్న వ్యక్తులను గుజరాత్ పోలీసులు అరెస్ట్ చేశారు. మోర్బి జిల్లాలో సుమారు ఏడాది నుంచి నిర్వహిస్తున్న ఈ నకిలీ టోల్ ప్లాజా ద్వారా నిందితులు 75 కోట్లకు పైగా వసూలు చేశారు. ఈ సందర్భంగా పోలీసులు స్థానికంగా పలుకుబడి ఉన్న ఒక నేత కుమారుడు సహా ఐదుగురిని అరెస్ట్ చేశారు. బంబన్‌బోర్-కుచ్ నేషనల్ హైవేపై మోర్బి-వాంకనర్ ఊర్ల మధ్య వఘాసియా టోల్ ప్లాజా ఉంది. అయితే ఆ టోల్ ప్లాజా తగలకుండా నిందితులు అక్కడ ఉన్న సిరమిక్ ఫ్యాక్టరీ వద్ద రోడ్డును మళ్లించి కొత్త రోడ్డు వేసి మధ్యలో నకిలీ టోల్ ప్లాజాను ఏర్పాటు చేశారు.

ఆర్టికల్ 370 రద్దుపై 11న సుప్రీం తీర్పు

న్యూఢిల్లీ, డిసెంబర్ 7: జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370 రద్దును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై ఈ నెల 11న సర్వోన్నత న్యాయస్థానం తీర్పు వెలువరించనున్నది. 16 రోజుల సుదీర్ఘ విచారణ అనంతరం సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం సెప్టెంబర్ 5న తీర్పును రిజర్వ్ చేసింది. 2019 ఆగస్టు 5న కేంద్ర ప్రభుత్వం ఆర్టికల్ 370ని రద్దు చేసింది.

కాంగ్రెస్ ఎంపీ బంధువుల ఇంట్లో 150 కోట్లు

స్వాధీనం చేసుకున్న ఐటీ అధికారులు

ఐటీ శాఖ దాడుల్లో పట్టుబడిన డబ్బు

రాంచి, డిసెంబర్ 7: జార్ఖండ్‌కు చెందిన కాంగ్రెస్ రాజ్యసభ ఎంపీ ధీరజ్ ప్రసాద్ సాహు బంధువుల ఇళ్లు, ఇతర సంస్థలపై ఆదాయపు పన్ను శాఖ అధికారులు రెండు రోజుల పాటు దాడులు జరిపి రూ.150 కోట్లకు పైగా నగదును స్వాధీనం చేసుకున్నారు. ఒడిశాలోని బౌద్ధ్ డిస్టిలరీ ఆవరణలో పట్టుబడ్డ కట్టల కట్టల సొమ్మును లెక్కపెట్టడానికి ఐటీ అధికారులు పలు కౌంటింగ్ మిషన్లను తెచ్చారు. అలాగే సాహుకు చెందిన ఒడిశాలోని లోహర్‌డాగ, రాంచీ, పశ్చిమ బెంగాల్‌లోని సంస్థలపై దాడులు జరిపి ముఖ్యమైన పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్త అయిన ధీరజ్ సాహు రెండు సార్లు కాంగ్రెస్ నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యారు.

కాప్ సదస్సులో ప్రసంగించనున్న శ్రీశ్రీ రవిశంకర్

బెంగళూరు, డిసెంబర్ 7: మానవతావాది, ఆధ్యాత్మికవేత్త శ్రీశ్రీ రవిశంకర్ దుబాయ్‌లో నిర్వహిస్తున్న ఐక్యరాజ్యసమితి పర్యావరణ సదస్సు (కాప్-28)లో ప్రసంగించనున్నారు. డిసెంబర్ 8న సభ్య దేశాల అధినేతలను ఉద్దేశించి 'ఆధ్యాత్మిక శాంతి, పర్యావరణం' అన్న అంశంపై సదస్సులో ఆయన ప్రసంగిస్తారని యుఏఈ పర్యావరణ మంత్రి సుసానే మహ్మద్ తెలిపారు. వారం రోజుల పర్యటన నిమిత్తం శ్రీశ్రీ రవిశంకర్ ఇప్పటికే దుబాయ్‌కు చేరుకున్నారు. తన పర్యటనలో తొలుత యుఏఈలో అతిపెద్ద నగరం పుజైరా పాలకుడు హమద్ బిన్ మహ్మద్ అల్ షర్కీతో సమావేశమై పలు అంశాలపై శ్రీశ్రీ రవిశంకర్ చర్చించనున్నారు. ఆ తర్వాత పర్యావరణం, శాంతియుత జీవనం తదితర విషయాలపై కాప్-28 సదస్సులో ప్రసంగిస్తారు. పర్యావరణ సదస్సులో భాగంగా ఏర్పాటుచేసిన వివిధ కార్యక్రమాల్లో శ్రీశ్రీ రవిశంకర్ ముఖ్య అతిథిగా పాల్గొంటున్నారు.

4 గంటలకుపైగా స్మార్ట్‌ఫోన్ వాడితే మానసిక సమస్యలు!

సియోల్, డిసెంబర్ 7: రోజూ 4 గంటలకు పైగా స్మార్ట్‌ఫోన్‌ను వాడే కౌమార వయస్కులు(10-19 ఏండ్లు) మానసిక ఆరోగ్య సమస్యల బారిన పడే ప్రమాదం ఉన్నదని తాజా అధ్యయనం పేర్కొంది. స్మార్ట్‌ఫోన్ వాడకం వల్ల నిద్రలేమి, కండ్ల సమస్యలు, కండరాల సమస్యలు వస్తాయని గత పరిశోధనలు తెలిపాయి. ఈ నేపథ్యంలో కౌమార వయస్కుల స్మార్ట్‌ఫోన్ వాడకం, వారి ఆరోగ్యానికి మధ్య ఉన్న సంబంధాన్ని మరింత లోతుగా అర్థం చేసుకొనేందుకు హనియంగ్ యూనివర్సిటీ వైద్య కేంద్రం 50 వేల మంది సమాచారాన్ని విశ్లేషించింది. స్మార్ట్‌ఫోన్ వాడకానికి వయసు, లింగం, సామాజిక ఆర్థిక పరిస్థితులకు ఉన్న సంబంధాన్ని కూడా ఈ అధ్యయనం చర్చించింది. రోజుకు నాలుగు గంటల కంటే తక్కువగా స్మార్ట్‌ఫోన్ వాడే కౌమార వయస్కులతో పోలిస్తే నాలుగు గంటల కంటే ఎక్కువ వాడేవారిలో ఒత్తిడి స్థాయి, ఆత్మహత్య ఆలోచనలు ఎక్కువని వెల్లడించింది.

ఇక బంజరులోనూ బంగారు పంటలు

గాజుతో చేసిన ఫర్టిలైజర్లతో సాధ్యమే బనారస్ హిందూ యూనివర్సిటీ ప్రకటన

వారణాసి: దేశంలో ఎందుకూ పనికిరాకుండా ఉన్న వేల ఎకరాల బంజరు భూముల్లో బంగారు పంటలు పండించే అత్యంత సులువైన మార్గాన్ని బనారస్ హిందూ వర్సిటీ పరిశోధకులు అభివృద్ధి చేశారు. గాజుతో తయారుచేసిన ఎరువులతో బంజరు భూముల్లో పంటలు పండించే అవకాశం ఉంటుందని సిరామిక్ ఇంజినీరింగ్ విభాగం సీనియర్ శాస్త్రవేత్త ఆర్కే చతుర్వేది తెలిపారు. గాజు 19 మూలకాలతో తయారవుతుందని, ఆ మూలకాలు బంజరు భూముల్లో పంటలకు అవసరమైన మృత్తికలు అభివృద్ధి చెందేందుకు ఉపయోగపడుతాయని చెప్పారు. గాజులో నైట్రోజన్, ఫాస్ఫరస్, పొటాషియం, సోడియం, మెగ్నీషియం, కాల్షియం, సల్ఫర్, ఐరన్, మాంగనీస్, జింక్, కాపర్, నికెల్, కోబాల్ట్, ఆర్గానిక్ కార్బన్, మాలిబ్డినం, వనడియం, క్లోరిన్, బోరాన్, సిలికా మూలకాలుంటాయి. ఈ మూలకాలతో కూడిన గాజును ఉపయోగించి ఎరువులు తయారుచేస్తే దశాబ్దాలుగా నిరుపయోగంగా ఉన్న భూముల్లోనూ బంగారు పంటలు పండించవచ్చని చతుర్వేది పేర్కొన్నారు. రైతులు రసాయన ఎరువులను మానేసి, గాజుతో తయారైన సిరామిక్ ఎరువులను వాడితే అనేక లాభాలుంటాయని చెప్పారు. సిరామిక్ ఎరువులను రెండుమూడేండ్లకు ఒకసారి వాడితే సరిపోతుందన్నారు.

అగ్ని-1 పరీక్ష సక్సెస్

బాలాసోర్, డిసెంబర్ 7: స్వల్ప శ్రేణి బాలిస్టిక్ క్షిపణి అగ్ని-1 పరీక్షను భారత్ గురువారం విజయవంతంగా నిర్వహించింది. ఒడిశా కోస్తాలోని ఏపీజే అబ్దుల్ కలాం దీవి నుంచి దీనిని పరీక్షించినట్టు రక్షణ శాఖ అధికారులు తెలిపారు. ఈ క్షిపణిని ఇదే కేంద్రం నుంచి ఈ ఏడాది జూన్ 1లో విజయవంతంగా పరీక్షించారు.

కలల్ని నియంత్రించొచ్చు!

- *నిద్రలోనే అభ్యసనం చేయొచ్చు*
- *వినూత్న పరికరాన్ని అభివృద్ధి చేసిన అమెరికా స్టార్టప్ కంపెనీ*
- *ధర 1.25 లక్షల నుంచి 1.66 లక్షలు*

**'నిద్రపోతే ఏవేవో పీడ కలలు వస్తున్నాయ్. పడుకోవాలంటేనే భయంగా ఉంది' అనే మాటలు చాలా మంది చెప్పడం చూస్తూనే ఉంటాం. భయపెట్టే కలలు కాకుండా, మనకు నచ్చిన, అందమైన తీపి కలలు (డ్రీమ్స్) కంటే ఎంత బాగుంటుంది? అంతే కాదు.. నిద్రలోనే ఇంజినీర్లు కోడింగ్ రాస్తే ఎలా ఉంటుంది? జాబ్ ఇంటర్వ్యూ లేదా క్రికెట్లో నెగ్గేందుకు అవసరమైన కసరత్తు, మెళకువలను కూడా కలలోనే నేర్చుకొనే అవకాశంవస్తే?? చాలు.. ఊరుకోండి.. హాలీవుడ్ సైంటిఫిక్ థ్రిల్లర్ సినిమా కథలు చెప్పొద్దు అంటారా?? ఆగండి. ఇది నిజం. మనకు నచ్చిన కలల్ని కనడమే కాదు.. కెరీర్ అభివృద్ధికి అవసరమైన మెళకువలను కూడా